



# మనిషికో మనిషి మన్యే

డా॥ కొఠారి వాణీ చలపతిరావు

పందిట్లో పెళ్ళవుతోంది.

జోరుగా మోగుతున్న సన్నాయిమేళం, శ్రావ్యంగా వినిపిస్తున్న పెళ్ళి మంత్రాలు, అతిథులు, మిత్రుల ఆశీస్సులు, వీటన్నింటి మధ్య విక్రమ్ రేవతి మెళ్ళో మూడు ముళ్లూ వేసాడు.

ఆ క్షణంలో—

రేవతి గుండెలు భయంతో దడదడలాడాయి. మనసంతా ఏదో చెప్పలేని దిగులు ఆక్రమించుకుంది. చిలిపి ఊహలకు బదులు కళ్ళ ముందు భయానకదృశ్యాలు కదలాడసాగాయి.

రేవతిలో ఆ భయం అప్పుడే కొత్తగా పుట్టింది కాదు. పెళ్ళి నిశ్చయమైన మరుక్షణం నుండే ప్రారంభమై అది పెళ్ళి ఘడియలో తీవ్రరూపం దాల్చింది.

బంతులాటలు, ఆడపడుచు అలకలు, వియ్యపురాలి వేడుకలు అన్నీ ముగిసిన తర్వాత అంపకాల కార్యక్రమం మొదలైంది.

ఈసారి రేవతి గుండెల్లో ఏకంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ళే పరుగెత్తడం ప్రారంభించాయి.

ఇన్నాళ్లూ తనకు చల్లని నీడను, చక్కటి మనశ్శాంతిని భద్రతను, రక్షణను కల్పించిన ఆ యింటిని వదలిపెట్టి, పరాయి ఇంటికి వెళుతూంటే శత్రురాజ్యంలో అడుగు పెడుతున్న భావం కలిగింది రేవతిలో.

ఇక బ్రతికున్నంత కాలం ఆ ఇంట్లో జీవిత ఖైదీగా బ్రతకాలి తను. ఆ బ్రతుకయినా ఇన్ని సంవత్సరాలు అని గ్యారంటీ లేదు. అదో జనారణ్యం గనుక ఏ క్షణంలోనయినా ఏదో ఒక క్రూరమృగం తనని కబళించి వేయవచ్చు.

అత్తగారు ఓ ఆడ పులి—

మామగారు ఓ సింహం—

ఆడపడుచు జిత్తులమారి నక్క అయితే, భర్తగారు ఓ తోడేలు — అవును. అది నిజంగా జనారణ్యమే. ఇన్ని క్రూరమృగాల బారినుండి తప్పించుకొని తను బ్రతికి బట్ట కట్టగలదా అసలు? అనుకుంది రేవతి దిగులుగా. ఇలా - మనసంతా నిండుకున్న ఆలోచనలు, కళ్ళనిండా అలుముకున్న విచారంతోనే కొత్త కోడలుగా ఆ రాత్రి అత్తవారింట గృహ ప్రవేశం చేసింది రేవతి. ఆ కొత్త వాతావరణం, సరి కొత్త మనుష్యుల మధ్య ఆ రాత్రంతా ఆమెకు నిద్ర పట్టలేదు.

కళ్ళు మూసుకుంటే ఏవేవో దృశ్యాలు కళ్ళముందు భయంకరంగా కనిపించటం మొదలు పెట్టాయి.

* * *

అప్పుడు రేవతి పదేళ్ళ పిల్ల.

వేసవి సెలవులలో సరదాగా గడపాలని పెదనాన్నగారి ఇంటికి వచ్చింది.

తన ఈడు పిల్లలే అయిన పెదనాన్నగారి కూతుర్లతో అష్టాచెమ్మా ఆడుతూ కూర్చుంది.

ఆ పల్లెటూరి వాతావరణం, అక్కడి ఆటలు అంటే రేవతికి చాలా ఇష్టం. ఎండ దెబ్బ తగులుతుందని పగలంతా పిల్లల్ని బయటికి వెళ్ళ నివ్వకుండా ఇంట్లో బంధించి తలుపులు వేస్తారు పెదనాన్నగారు. అందుకని ఆ సమయంలో పచ్చీసు, చింత పిక్కలాట లాంటివి ఆడుకునే వాళ్ళు. సాయంత్రం అవుతూనే ఆరుబయట ఊడిపించి చల్లటి నీళ్ళు చల్లించేది పెద్దమ్మ అప్పుడే జైలునుంచి విడుదలైనట్లు ఒక్కసారిగా అందరూ బయటకు పరుగెత్తు కొచ్చి, బిళ్ళ గీయడం, నాలుగుస్తంభాలాట ఆడటం, వెన్నెల రాగానే వెన్నెల కుప్పలు పోయడం చేసేవాళ్ళు. అక్కడ ఉన్నన్ని రోజులూ ఒకటే సందడి. పట్టణంలో నాలుగో ఫ్లోర్‌లోని నలభై రెండో నంబరు బ్లాక్‌లో పంజరంలో పక్షిలా పడుండే రేవతికి పెదనాన్నగారి ఇంటికి రాగానే కొత్తగా

రెక్కలు మొలిచినట్లు అనిపిస్తుంది.

రోజులాగే ఆ రోజూ బయట ఆవరణలో పిల్లలంతా చేరి సందడిగా ఆడుకుంటున్నారు.

ఇంతలో ఉన్నట్టుండి ఇంట్లో నుండి ఘొల్లున ఏడ్పులు వినిపించాయి. బిత్తరపోయి పిల్లలంతా లోపలికి పరుగెత్తారు. ముందుగా వెళ్ళిన రేవతికి గుండెలు బాదుకుంటూ పెద్దగా ఏడుస్తున్న పెద్దమ్మ కనిపించింది. పెద నాన్నగారు తలపట్టుకుని కుర్చీలో కూలబడి ఉత్తరీయంలో ముఖందాచు కొని వెక్కివెక్కి ఏడుస్తున్నారు.

అప్పటి వరకు ప్రశాంతంగా వున్న ఇల్లు అంత అకస్మాత్తుగా శోకనిల యంలా ఎలా మారిందో రేవతికి అర్థంకాలేదు. అక్కడి వాతావరణం చూసి బెదిరి పోయిన పెదనాన్నగారి కూతురు సీత తల్లి దగ్గరకు వెళ్ళి "అమ్మా! ఏమైందే? ఎందుకు ఏడుస్తున్నావ్?" అంది దీనంగా చూస్తూ. దాంతో పెద్దమ్మ దుఃఖం తీవ్ర రూపం దాల్చింది. కూతుర్ని దగ్గరికి తీసుకుని గుండెలకి హత్తుకుంటూ,

"అమ్మా! ఏం చెప్పనే తల్లీ! మీ అక్కయ్యను ఆ రాక్షసులు చంపేసారే. నేను చెబుతూనే వున్నాను మీనాన్నతో ఆ పాపిష్టి కొంపలో నుండి నా కూతుర్ని బయటికి తీసుకొనిరండీ అని. నా మాట వింటేనా? 'లోకం ఏమనుకుంటుందే' అంటూ ఎప్పటికప్పుడు నా నోరు మూయించారు? అందుకే నా బిడ్డను నిలువునా కాల్చి చంపేసారు ఆ రాక్షసులు. చచ్చి పోయిన నా బిడ్డను ఈ లోకం ఇప్పుడు బతికిస్తుందా?" అంటూ బిగ్గరగా ఏడ్చింది పెద్దమ్మ

అప్పటికప్పుడే ప్రయాణమై వసంతక్క అత్తగారింటికి వెళ్ళారు పెద్దమ్మ పెద్దనాన్న.


ఆ సాయంత్రానికి వేన్‌లో శవం ఇంటి ముందుకి వచ్చింది. రేవతి తల్లి దండ్రులు, ఇతర బంధువులు కూడా ఆ సమయానికి అక్కడికి వచ్చారు. ప్రమాదవశాత్తు పైటకొంగుకు మంట అంటుకొని వసంత మరణించిందని చెప్పారట ఆమె అత్తగారు, భర్త. పోలీసులు కూడా రిపోర్ట్‌లో అదే రాసుకుని వెళ్ళారట.

'కానీ అది హత్యే' అని పెద్దమ్మ ఖచ్చితంగా చెబుతున్నది. ఆ మర్నాడు సాయంత్రం తల్లితో పెద్దమ్మ చెబుతూంటే విన్నది రేవతి. 'వాళ్ళు బాగా డబ్బు మనుషులమ్మా. కట్నాలనీ, లాంఛనాలనీ నా బిడ్డని, పీడించుకొని తింటు న్నారు. అప్పటికీ మా స్థోమతుకు తగ్గట్టు మేము అవీ ఇవీ జరుపుతూనే వున్నాం. తన కొడుక్కి లక్షల కట్నం ఇస్తామని వచ్చారనీ, మరీ ఇంత దరిద్రపు గొట్టు సంబంధం అనుకోలేదనీ ఎప్పుడూ అత్తగారు ఆడి పోసుకొనే దట. ఉన్నవీ, లేనివీ కల్పించి తల్లికి చెప్పి ఆ చుప్పనాతి ఆడబిడ్డ మరింత పుల్లలు పెట్టేదట. ఎవరు ఎలాంటి వారైనా కట్టుకున్న మొగుడు మంచి వాడైతే చాలనుకున్నాను. కానీ వాడూ మంచి, చెడుల విచక్షణ లేని వాడని తెలిసింది. ఎంత సేపూ తల్లి, అక్క ఆడించినట్లు ఆడటమే గానీ పెళ్ళాన్ని గురించి కూడా ఆలోచించాల్సిన బాధ్యత తనకుందని గుర్తించలేని మూర్ఖుడు అతను - అంటూ వసంతక్క చావుకు కారణం ఆమె అత్తింటి వాళ్ళే అని చెప్పింది ఆమె.

'దీని పీడ విరగడైపోతే నా కొడుక్కి రాజాలాంటి సంబంధం మరొకటి చేస్తాను, అని కూడా వసంతక్క అత్తగారు అన్నట్లు పెద్దమ్మ చెప్పింది.

ఆ సంఘటనతో నిండునూరేళ్ళు సాగాల్సిన వసంత జీవితం మొగ్గలోనే నలిగి పోయింది. ఆమె నిర్దాక్షిణ్యంగా చంపబడింది. దాంతో చిన్నారి రేవతి హృదయంలో పెను తుఫాను చెలరేగింది. ఆడుతూ పాడుతూ కాలం గడపాల్సిన వయసులో ఒక రకమైన స్తబ్దత ఏర్పడింది.

వసంత ముఖం కళ్ళల్లో మెదిలినప్పుడల్లా పెళ్లి పట్ల నిరసన ఆమెలో చోటు చేసుకో సాగింది. ఆడపిల్ల పెళ్ళంటే అది ఆమె ఆఖరి ప్రయాణానికి చేస్తున్న ఏర్పాట్లుగా అనిపించసాగింది. 'పెళ్ళి' అన్నా, 'భర్త' అన్నా చిలిపి ఊహలకు బదులు ఆమెలో భయానక దృశ్యాలు మెదల సాగాయి. అందుకే ఈ జన్మలో అసలు పెళ్ళే చేసుకోకూడదు అనుకుంది.



అర్జంటుగా మీకు పెరుగు కావాలా, పాలు గోరువెచ్చగా ఉన్నప్పుడు కొంచెం సిట్రిక్ యాసిడ్ కలపండి. పెరుగు రెడీ.

***

వర్షాకాలంలో ఉప్పు, నీరు కారి పోయి ఇబ్బంది పెడుతుంది. అలా కాకుండా ఉండాలంటే రెండు పచ్చి మిరపకాయలు ఉప్పులో వేయండి ఉప్పు నీరు కారకుండా ఉంటుంది.

అలాంటి రేవతి ఈ రోజు పెళ్ళికూతురైంది. కారణం ఈ సమాజంలో ఆడ పిల్లలకు పెళ్ళి ఒక తప్పనిసరి కార్యక్రమం. ఇష్టం ఉన్నా లేక పోయినా ఆమె పెళ్ళి చేసుకోక తప్పదు. పరాయి ఇంటికి వెళ్ళక తప్పదు.

* * *

పెళ్ళి కొచ్చిన బంధువులు ఇంకా అందరూ వెళ్ళి పోక పోవటంతో ఇల్లు సందడిగా, హడావుడిగా వుంది. బిక్కు బిక్కుమంటూ తన గదిలో కూర్చున్న రేవతి దగ్గరకు కబుర్లు చెప్పటానికి వచ్చింది జయ. గల గలా మాట్లాడుతూ ఎక్కడెక్కడి ముచ్చట్లో చెప్ప సాగింది.

ఇంతలో హడావుడిగా అక్కడికి వచ్చింది రేవతి అత్తగారు,

"అమ్మాయ్ జయా! ఎక్కడున్నావే? అర్జంటుగా కిరసనాయిల్ తెప్పిం చాలే, నీ కొడుకు బయట ఎక్కడున్నాడో చూసి కాస్త వాణ్ని షాపుకు పంపించు" అంటూ. అత్తగార్ని చూసి ఉలిక్కి పడింది, రేవతి. ఆమె ఆ ఉలికి పాటుకు కారణం అత్తగారు అక్కడికి రావటం కాదు. ఆమె నోటి నుండి వచ్చిన 'కిరసనాయిలు' అన్న మాట.

నిన్న కూడా ఆడపడుచు జయ అగ్గిపెట్టె కోసం వెతుక్కుంటూంటే ఇలాగే ఉలిక్కి పడింది. ఆ మాటలు తనలో అంత ఉలికిపాటును ఎలా కలిగిస్తున్నాయో తనకే అర్థం కాలేదు రేవతికి.

చిన్ననాడే లేత మనసులో లోతుగా ఏర్పడ్డ గాయం తాలూకు లక్షణాలు అవి అని ఆమెకు ఆలస్యంగా గానీ తెలియలేదు.

"ఇక్కడ కూర్చుని మరదలితో కబుర్లు చెబుతున్నావా? నీ కోసం ఇల్లంతా తిరిగి వస్తున్నాను. అనుకోకుండా ఇప్పుడే గ్యాస్ అయిపోయింది. వంట సగంలో ఉంది. నాకు కాస్త కిరసనాయిలు తెప్పించి పెట్టి ఆ తరువాత ఎంత సేపంటే అంత సేపు మరదలితో ముచ్చట్లు చెప్పుకో" అంది అత్తగారు.

"అబ్బా! ఏమిటమ్మా. రేపు ఎలాగూ ఊరికెళ్ళిపోతున్నాను కదా అని ఈ రోజంతా మరదలితో గడపాలి అనుకున్నాను. మధ్యలో పిలిచి పనులు చెబుతున్నావ్." అంటూ గునుస్తూ లేచి బయటికి వెళ్ళింది జయ.

తనూ లోపలికి వెళ్ళబోతూ ఒక క్షణం ఆగి చిరునవ్వుతో కోడలి వంక చూస్తూ "ఏమ్మా ! రేవతీ, ఎలావుంది మా ఇల్లు... మా ఇల్లు ఏమిటి నా ముఖం మన ఇల్లు. అంతా కొత్తగా వుంది కదూ. కొత్తలో అలాగే వుంటుంది. కొద్ది రోజులయితే నీకే అలవాటై పోతుంది. నీకు ఎప్పుడు మీ అమ్మను చూడాలనిపిస్తే అప్పుడు నిర్మొహమాటంగా నాతో చెప్పు. పంపించే ఏర్పాట్లు చేస్తాను. నాలుగు రోజులుండి మళ్ళీ వద్దువుగాని, ఏ విషయమైనా అడగటానికి సంకోచపడకు. వస్తానమ్మా వంటింట్లో పనుంది. మధ్యాహ్నం పని తీరాక మాట్లాడుకుందాం" అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది రేవతి అత్తగారైన సులోచన.

అత్తగారి మాటలకు ఆశ్చర్య పోయిన రేవతి తన చెవులను తనే నమ్మ లేక పోయింది.

ఇన్నాళ్ళూ తన మనసులో తనకు తానుగా ఏర్పరచుకున్న దృశ్యాలన్నీ ఒక్కసారిగా తల్లకిందులై వాటి స్థానంలో సుందర దృశ్యాలు రూపుదిద్దు కోవటం ప్రారంభమయ్యాయి. రేవతిలో అకస్మాత్తుగా ఏదో ఉత్సాహం వచ్చి నట్లయింది. ఆ ఉత్సాహంతోనే లేచి, అత్తగారు వంటింట్లో అవస్థపడతూ

ఉంటే తను దర్జాగా అలా బెడ్ రూమ్‌లో కూర్చోవటం ఏం బాగుంటుంది అనిపించి వంటింట్లోకి వెళ్ళింది.

అత్తగారు రోట్లో పచ్చడి ముక్కలు వేయడం, గుమ్మంలో నిల్చున్న మామగారు 'ఇంకా వంట కాలేదా?' అంటూ ఆమెను ప్రశ్నించడం రేవతికి కనిపించింది. పచ్చడి నూరటానికన్నట్లు ఆ పక్కనే ఉన్న రోకలి బండ చేతిలోకి తీసుకుంది రేవతి.

"వచ్చి నాలుగు రోజులు కాలేదు. కొత్త కోడలితో అప్పుడే పనులు చేయిస్తున్నావా?" అన్నారు మామగారు.

ఆ మాటలకు-

అటుతిరిగి పప్పులో పోపుపెడుతున్న సులోచన గిరుక్కున వెనక్కు తిరిగి చూసింది.

"అప్పుడే నీకి పనులన్నీ ఎందుకమ్మా నేను చేయగలిగినంత కాలం నీకు వంటింట్లో అడుగు పెట్టాల్సిన అవసరమే వుండదు. రేపు ముసలి దాన్నయి నేను మూల పడితే అప్పుడు నీకు ఎలాగూ తప్పదు' అంటూ కోడలి చేతిలో పని తను అందుకోబోయింది సులోచన.

"ఫరవాలేదత్తయ్యా! నన్ను చేయనీయండి" అంటున్న రేవతి మాటలకు అడ్డు వస్తూ...అకస్మాత్తుగా అక్కడికి వచ్చింది ఆడపడుచు జయ.

"రేపెలాగూ నేను వెళ్ళి పోతున్నాను కదా. ఈ ఒక్క రోజూ నేను చేస్తాను. రేపటినుండి ఎవరు చేయాలన్నది మీ అత్తా కోడళ్ళు నిర్ణయించుకోండి " అంటూ చనువుగా మరదలి చేతిలోనుండి రోకలిబండ తను అందుకుని చకచకా పచ్చడి నూరటం మొదలు పెట్టింది. ఇంకా 'ఇది కలా నిజమా' అన్న సంధిగ్ధావస్థనుండి పూర్తిగా బయటపడని రేవతి విస్మయంగా చూస్తూ అలాగే నిల్చుండి పోయింది.

* * *

మధ్యాహ్నం భోజనాలైన తర్వాత ఆడవాళ్ళు ముగ్గురూ చాపలేసుకుని మధ్యహాల్లో కూర్చున్నారు. పెళ్ళయి పదిరోజులైనా ఇంకా బిడియంగా, సిగ్గుగా ఇంట్లో తిరుగుతున్న మరదలికి కొత్తదనం పోగొట్టే ఉద్దేశంతో అన్నట్లు చనువుగా కబుర్లలో పడేసింది జయ.

మధ్య మధ్య సులోచన కూడా వాళ్ళ సంభాషణలో గొంతు కలుపుతున్నది.

"అమ్మాయ్ రేవతీ, మీకు ఎండాకాలం శలవలు అయిపోవస్తున్నాయి కదా. జూన్ వస్తే కాలేజీలు తెరుస్తారు. ఈ లోగా ఒకసారి విక్రమ్‌తో కల్సి మీ వూరు వెళ్ళి టి.సి తెచ్చుకో" అంది సులోచన.

ఈ సారి రేవతికి ఆ మాటల భావం ఏ మాత్రం అర్థం కాలేదు.

"టి.సి నా? అదెందుకత్తయ్యా!" అంది అయోమయంగా.


"ఎందుకేమిటి? కాలేజీలో చేరి ఎమ్.ఏ చెయ్యవా?" అంది సులోచన. ఈ సారి ఆశ్చర్య పోవటం ఆమె వంతు అయింది.

ఆ మాటలకు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయింది రేవతి. 'వివాహాయ విద్యానాశయ' అన్నది పాత సామెత అన్న విషయం ఆమెకు మొదటిసారి తెలిసింది. పెళ్ళవుతూనే ఇల్లు, సంసారం, పిల్లలు ఈ గొడవల్లో పడి తన చదువును, తెలివి తేటల్ని వ్యర్థం చేసుకునే ఆడవాళ్ళే అధికంగా వున్న ఈ సమాజంలో అత్తగారి మాటలు ఆమెకు కొత్తగా వినిపించాయి.

కోడలు వచ్చిందంటే కొత్తగా పనిమనిషి వచ్చినట్లు ఆనందించే అత్త గార్లే వుంటారనుకున్న రేవతికి తన అత్తగారిలో కొత్తరూపం కనిపించింది.

" చిన్న పిల్లవు. నీకు ఎంతో భవిష్యత్తువుంది. పెళ్ళయినంత మాత్రాన సంసార ఝంఝాటంలో పడి చదువు పాడు చేసుకోవాలా? ఇంట్లో పని చేసుకోవటానికి నేను వున్నాను. రోజూ కాలేజీలో దింపి, మళ్ళీ ఇంటికి తీసుకొని రావటానికి విక్రమ్ వున్నాడు. ఇంకా ఏమిటి నీకు ఇబ్బంది? ఆ చదువు కాస్తా పూర్తయిందాకా కాస్త జాగ్రత్తపడి ఆ తరువాత ఓ మనవరాల్ని కని నా కిచ్చేసి వుద్యోగంలో ప్రవేశించు" అంది సులోచన.

"అవును రేవతీ! ఎలాంటి పరిస్థితిలోనూ నువ్వు స్టడీస్ మాత్రం మానకు. ఆడ అయినా మగ అయినా అందరికీ చదువు ముఖ్యం. పెద్దవాళ్ళు వాళ్ళ



శికాయ పొడితో తల స్నానం చేసేటప్పుడు దాంట్లో నాల్గింట ఒక భాగం మెంతి పొడి కల్పుకోండి. వెంట్రుకలకు ఎంతో మేలు చేస్తుంది.

***

గ్యాస్ పొయ్యి బర్నర్‌ను నీటితో కడిగే ముందుగా కొంచెం కొబ్బరి నూనె రాయండి. ఆ తర్వాత కడిగి శుభ్రంగా తుడవండి, జిడ్డు పోతుంది. తుప్పు పట్టకుండా ఉంటుంది.

డి. భరణి

బాధ్యతలు తీర్చుకోవటం కోసం ఆడ పిల్లలకు త్వరగా పెళ్ళిళ్ళు చేస్తారు. అంత మాత్రాన వాళ్ళ జీవితాలు వంటింటికే అంకితమై పోనక్కరలేదు. ఆర్థిక స్వాతంత్ర్యం, మంచి వ్యక్తిత్వం ఎవరికైనా తప్పనిసరిగా కావల్సినవి" అంది జయ. బ్యాంక్ ఆఫీసర్ అయిన ఆడపడుచు జయ అలా మాట్లాడ్డం ఆశ్చర్య మేమీ అనిపించలేదు రేవతికి. కానీ ఆ కాలం మనిషైన అత్తగారు ఈ కాలం పోకడలను, భావాలను అర్థం చేసుకొని మాట్లాడటం రేవతికి ఆనందాశ్చర్యాల్ని కలుగ జేసింది.

* * *

ఉదయం లేచినప్పటినుండీ బట్టలు, పచ్చళ్ళు సర్దుకుంటూ ప్రయాణానికి సిద్ధం కావటం మొదలు పెట్టింది జయ. సులోచన కూతురికి పసుపు, కుంకుమ పెట్టి పట్టుచీర పెట్టింది. మనవడికి, అల్లుడికి భర్త చేత కొత్త బట్టలు పెట్టించింది.

"జాగ్రత్తగా వెళ్ళండి. వెళ్ళగానే ఉత్తరం రాయి. మీ అత్తగారిని అడిగానని చెప్పు. అసలే ఆవిడ ఆరోగ్యం బాగుండటం లేదన్నావ్. ఆఫీసు పనులు, ఇంటి పనులు ఎన్నివున్నా ఆమెను మాత్రం నిర్లక్ష్యం చేయకు, వేళకు మందులు ఇస్తూ పూర్తి విశ్రాంతి తీసుకునేలా చూడు."

అంటూ ఒక పక్క బాస్కెట్‌లో తినుబండారాలు సర్దుతూనే మరో పక్క కూతురికి జాగ్రత్తలు, హెచ్చరికలు చేస్తున్నది సులోచన.

సంపంగి పువ్వు రంగున్న వెంకటగిరి జరీ చీరను కవరులో పెట్టి జయ చేతికిస్తూ "ఇదిగో, ఈ చీర నేను ఇచ్చానని చెప్పి మీ అత్తగారికి ఇయ్యి. పాపం పెద్దావిడ పెళ్ళి కెలాగూ రాలేక పోయింది" అంది.

పక్కగదిలో నిలువుటద్దం ముందు నిల్చుని జడ అల్లుకుంటున్న రేవతి చెవిలో అత్తగారి మాటలు పడ్డాయి.

అంపకాలు చేసి తనను అత్తవారింటికి పంపేటప్పుడు తన తల్లి కూడా అచ్చం ఇలాగే కాకపోయినా ఇలాంటి మాటలే చెప్పి పంపించింది.

"అమ్మారేవతీ ఈ రోజునుండి నీ జీవితం కొత్త మలుపు తిరగబోతున్నది. కొత్త మనుషులు, కొత్తవాతావరణంలో ఎలా ఇముడుతావో అని నాకు భయంగా వుంది. జాగ్రత్తగా మసలుకోవాలమ్మా అత్తవారింట అడుగు పెడుతూనే నీ భర్త మీద నీకు కొన్ని హక్కులు, కొంత చనువు కలిగే మాట నిజమే. కానీ ఆ హక్కు అతన్ని అతని తల్లిదండ్రులనుండి దూరం చేసేదిగా, ఆ చనువు అతన్నికించ పరిచేదిగా వుండకూడదు. భార్య రాకతో భర్త జీవితం పరిపూర్ణమయ్యే మాట నిజమే గానీ ఆ భర్త ఉనికికి కారణం అతని తల్లి మాత్రమే. ఆ విషయం మాత్రం ఎప్పుడూ మర్చిపోకు. నీ అత్తగారు లేకుంటే నీ భర్త కూడా ఉండే వాడు కాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోగలిగితే ఆమెను గౌరవించ గలుగుతావు. అలా నువ్వు చెయ్యలేనప్పుడు నీ చేతులతో నీ సంసారాన్ని నువ్వే కలతల పాలు చేసుకున్న దానివవుతావు." అంటూ ఇంకా ఏమేమో చెప్పింది. 'కూతుర్ని అత్తవారింటికి పంపేటప్పుడు ప్రతితల్లీ తన కూతురికి ఇలా చెప్పగలిగితే, పెద్దలను గౌరవించటం ఎలాగో నేర్పగలిగితే ప్రతి ఇల్లూ ఒక స్వర్గం కాదా' అనిపించింది రేవతికి. వంటింట్లో నుండి ఆడపడుచు జయ తల్లితో అంటున్నది.

"అమ్మా! రేవతి పాపం చిన్న పిల్ల. తెలిసో తెలియకో ఏదైనా పొరపాటు

## బయో టెక్నాలజీ రంగంలో



### గీతాశర్మ

ఉస్మానియా యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ అఫ్ మైక్రోబయాలజీలో రీడర్ హోదాలో పని చేస్తున్న డాక్టర్ గీతాశర్మ మాలెక్యులర్ జెనెటిక్స్‌లో విశేష కృషి చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్శిటీ లో 1970 లో జన్యుశాస్త్రంలో ఎమ్.ఎస్.సి చేసిన గీతాశర్మ, ఎలుకల జీవకణాలపై ఇన్‌ఫ్లుయెంజా వైరస ప్రభావం అను అంశంపై డాక్టర్ హనుమాన్లు పోలాసా గారి నేతృత్వంలో సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించి 1976 లో డాక్టరేట్ పొందారు. 1974 నుండి '86 వరకు లెక్చరర్‌గా పని చేసి, '86 నుండి రీడర్ హోదాలో కొనసాగుతున్నారు.

1984 - '86 లో న్యూయార్క్ లోని యూనివర్శిటీ అఫ్ రాఛెస్టర్‌లోను; అనంతరం రెండు సంవత్సరాలు న్యూయార్క్ లోని మెమోరియల్ స్లోన్ కెట్టరింగ్ కేన్సర్ రీసెర్చి సెంటర్ లోను; 1990 లో న్యూయార్క్‌లోని మౌంట్ సినాయ్ మెడికల్. సెంటర్‌లోను విజిటింగ్ సైంటిస్ట్ గాపని చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ బోధనలో 19 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న గీతాశర్మ మైక్రోబయాల్ మరియు మాలెక్యులర్ జెనెటిక్స్‌లోను; వైరాలజీ, బాక్టీరియాలజీ లోను శిక్షణ ఇస్తూ, ఆ రంగంలో మంచి పేరు గడించారు. జన్యుశాస్త్రం గురించి ఆమె రాసిన వ్యాసాలు అంతర్జాతీయంగా పేరు పొందిన అనేక సైన్స్ జర్నల్స్‌లో ప్రచురింపబడ్డాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ బోర్డ్ అఫ్ స్టడీస్‌కు ఛైర్ పర్సన్‌గా ఉన్నారామె. వైరాలజీ ఎడ్యుకేషన్ కమిటీకి కన్వీనర్‌గాను వ్యవహరిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ అఫ్ మెడికల్ రీసెర్చి, డిపార్ట్‌మెంట్ అఫ్ బయోటెక్నాలజీ కు సమర్పించే రీసెర్చ్ ప్రాజెక్టులకు, వివిధ సైన్స్ జర్నల్స్‌లో ప్రచురించే వ్యాసాలకు రిఫరీగా పనిచేస్తున్నారు. క్లోన్ – టెక్ (హైదరాబాద్) మరియు శాంతా బయోటెక్నిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే బయో టెక్నాలజీ ఇండస్ట్రీలకు కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు.

ఈ సృష్టిలో అసంఖ్యాకమైన సూక్ష్మజీవులు ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రాణి కోటికి మేలు చేస్తే మరి కొన్ని హాని కలిగిస్తున్నాయి. ఈ రెండు రకాలైన సూక్ష్మజీవుల గురించి మైక్రోబయాలజీ రంగంలో విస్తృతమైన పరిశోధన జరుగుతోంది. ప్రాణి వ్యాధితో బాధపడడానికి కారకమైన సూక్ష్మజీవి ఏదో తెలుసుకుని దానికి తగిన మందు ఎలా తయారు చేయాలన్న విషయం తెలుసుకోవడానికి మైక్రోబయాలజీ సహాయపడుతుంది. ఉత్పాదనా శక్తిని అధికం చేయడానికి కూడా మైక్రోబయాలజీ రంగంలో కృషి జరుగుతోంది. ఉదాహరణకు పట్టు పురుగులు, పట్టును అధికంగా ఉత్పత్తి చేసేటట్లు చేయడానికి మైక్రోబయాలజీ పరిశోధన తోడ్పడుతుంది. మరింత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు తరాల వారిని మనకు అందించడానికి జన్యుశాస్త్రంలో పరిశోధనలు జరుగుతున్నాయి.

సంతానహీనులకు హార్మోన్ ట్రీట్‌మెంట్ తీసుకోవడ మన్నది ఎంతో ఖర్చుతో కూడిన పని. ఈ బయో టెక్నాలజీ లో కృషి చేసి, ప్రగతి సాధించి, హార్మోన్ ట్రీట్‌మెంట్ ను అతి తక్కువ ధరలోనే ప్రజలకు అందించాలన్నది డాక్టర్ గీతా శర్మ క'. ' అలాగే ప్రాణ రక్షక ఔషధాలు (ఉదాహరణకు ఇంటర్‌ఫెరాన్, ఇన్సులిన్) కూడా ప్రజలకు తక్కువ ధరలో అందించడానికి ఆమె కృషి చేస్తున్నారు.

విదేశాలలో స్థిరమైన ఉద్యోగావకాశాలు లభించినప్పటికీ తన మేధస్సు స్వదేశానికి ఉపయోగపడాలన్న ఆకాంక్షతో ఆమె ఆ అవకాశాలను తిరస్కరించారు. ప్రతి ఏడాది కొద్ది రోజులు విదేశాలకు వెళ్ళి తన విజ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటూ తమ పరిశోధన కొనసాగిస్తున్నారు.

లేబొరేటరీలో ఆమె మనసు, చేతి వ్రేళ్ళు ఎంత చురుకుగా పని చేస్తాయో అంతే చురుకుగా స్టేజీ మీద భరతనాట్యం చేస్తూ ఆమె తన్మయురాలవుతుంది. 15 సంవత్సరాల పాటు నాట్యాన్ని శ్రీమతి జయలక్ష్మి నారాయణ్ వద్ద ఆమె అభ్యసించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ నుండి భరత నాట్యంలో డిగ్రీ పొందారు. కర్ణాటక సంగీతం కూడా అభ్యసించారు. వ్యాసాలు, కవితలు అడపాదడపా రాస్తూంటారు. సైన్స్‌లోను, నాట్యం, సంగీతం, రచనా రంగాలలోనూ అందె వేసిన చేయి శ్రీమతి గీతాశర్మ

అరుణా మోహనరెడ్డి

---

చేసినా, తప్పుగా మాట్లాడినా కడుపులో పెట్టుకో, 'తప్పులు చేయటం పిల్లలకు సహజం. వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత నాదే' అనుకోగలిగితే ఇటు నీకు, అటు రేవతికి కూడా మనస్తాపం ఉండదు."

"ఆ విషయం నువ్వు నాకు చెప్పాలటే అమ్మాయ్, నాకు నువ్వెంతో, రేవతీ అంతే. అది ఏదయినా తప్పు చేసినా, 'ఇదే తప్పు నా బిడ్డ చేస్తే' అని వెంటనే నన్ను నేను ప్రశ్నించుకుంటాను. దాంతో అసలు గొడవలకు ఆస్కారమే ఉండదు" అంది సులోచన నవ్వుతూ.

రేవతి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

ఇప్పుడు ఆమెకు ఈ ప్రపంచం అంతా చాలా అందంగా అందులో నివసిస్తున్న మనుషులందరూ చాలా మంచివారిగా కనిపించసాగారు. అన్నాళ్లూ ఆమె మనసులో ముసురుకున్న అనవసర భయాలు అనే కారుమేఘాలు, ఆప్యాయత అనే చల్లగాలి తాకగానే అకస్మాత్తుగా వర్షించ సాగాయి.

ఆ రోజంతా ఆనందలోకాలలో తేలిపోతూ ఏదో కొత్త ప్రపంచంలో వున్నట్లు అనుభూతి పొందింది రేవతి.

"రేవతీ, ఈ రోజు ఎందుకో నువ్వు చాలా ఆనందంగా కనిపిస్తున్నావ్. పెళ్ళయిన ఇన్నిరోజుల్లో ఏ రోజూ నిన్ను ఇలా చూడలేదు నేను. ఎప్పుడూ ఏదో భయంగా, బిడియంగా ఇక్కడ ఉండలేక వుంటున్నట్లు కనిపించేదానివి, 'నేనంటే నా భార్యకు ఇష్టం లేదా?' అని ప్రతిక్షణం భయపడేవాడ్ని. కానీ రేవతీ. నాకు మాత్రం నువ్వంటే ప్రాణం. నీ అందం, నీ మంచి మనసు, నీ స్త్రీత్వం మొదటిసారి నిన్ను చూసినప్పుడే నన్ను ముగ్ధుడ్ని చేసాయి. ఒక్కనాకే కాదు. ఇంట్లో అందరికీ నువ్వు ఎంతగానో నచ్చావు. మా అమ్మ అక్కయ్య నిన్ను మెచ్చుకోని రోజు లేదు. ఇక మా నాన్నగారైతే 'మా ఇంటి మహాలక్ష్మి' అని పెద్ద సర్టిఫికేట్ ఇచ్చేసారు నీకు.." విక్రమ్ నోటినుండి వస్తున్న ప్రశంసల పరంపరను వింటూ సిగ్గుతో తలదించుకుంది రేవతి.

అంతమంది అభిమానాన్ని ఒకేసారి అందుకున్న ఆమె మనసు పట్టలేని ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయింది. ఇప్పుడు రేవతికి ప్రపంచం అంతా కొత్తగా వింతగా కనిపించసాగింది.

తను ఊహించినది ఒకటయితే, ఇక్కడ అనుభవానికి అందినది మరొకటి.

ఇంతకాలం ఎంతటి భ్రమలో, భయంతో కాలం గడిపింది తను?!

ఎక్కడో జరిగిన ఏవో సంఘటనలను బట్టి ఈ సమాజాన్నంతా అదే మూసలో పోసి చూసింది. అందర్నీ అనవసరంగా అనుమానించింది.

కానీ ఈ లోకంలో 'మంచి' వుంది.

మంచి మనుషులూ వున్నారు. వాళ్ళ మధ్య అనుబంధాలూ వున్నాయి. కానీ చెడు మరుగున పడిన మంచి తనమే, తాటి చెట్టు కిందవున్న 'పాల ముంత'లా అకారణ నిందకు గురవుతున్నది. చెడును చూసిన కళ్ళతో లోకం మంచిని గుర్తించ లేకపోతున్నది.❑ ❑